

గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	579 (280.1200)	1,20,635	6,598
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,653.23	456.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.558 (19.7310)	900	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

మూసీ రెండు గేట్లు ఎత్తివేత



కేతేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు వరద రాక పెరిగింది. దీంతో శుక్రవారం ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం రాత్రి 643.50 అడుగులుగా ఉన్న మూసీకి ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు 3, 8 నెంబర్ క్రస్ట్ గేట్లను అడుగుమేర ఎత్తి 1,340క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 7

ముసురేసింది



నల్లగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ముసురు కురిసింది. పత్తి చేలకు ఈ వర్షం జీవం పోసినట్లయింది. జిల్లా కేంద్రం పానగల్‌లోని చందనపల్లి సమీపంలో ముసురులోనే బతుకమ్మ పాటలు పాడుతూ మహిళా కూలీలు వరి నాట్లు వేశారు. అత్యధికంగా యాదాద్రి జిల్లా రాజాపేట మండలం పాముకుంటలో 18.5మి.మీ, నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేటలో 15.8మి.మీ, సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 15.5మి.మీ వర్షపాతం నమోదైంది.

సాగర్‌కు నిలకడగా వరద



నాగార్జునసాగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటి రాక నిలకడగా సాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 579 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 579 అడుగులకు (280.1200 టీఎంసీలు) చేరింది. ఎగువనుంచి 1,20,635 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, సాగర్ నుంచి మొత్తం 6,598 క్యూసెక్కుల నీటినిదిగువకు విడుదల చేస్తున్నారు. 7

'సొసైటీ యూరియా పక్కదారి'పై
సమగ్ర విచారణ

» విషయం బయటికి ఎలా పొక్కిందనే అంశంపై ఆరా » 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నల్లగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సొసైటీ యూరియా పక్కదారిపై సమగ్ర విచారణకు జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 'సొసైటీ యూరియా పక్కదారి' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సొసైటీకి కేటాయించిన యూరియాను ఫర్టిలైజర్ దుకాణం లో విక్రయించడం చట్టవ్యతిరేకమని, కథనం లో ప్రస్తావించి న అక్రమ విక్రయాల వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని ఆయన తెలిపారు. ఈ ఘటనపై విచారణ నిర్వహించి పూర్తి నివేదిక ఇవ్వాలని నకిరేకల్ ఏడీఏ, ఇద్దరు ఏవోలను ఆదేశించినట్లు తెలిపారు. ఎరువుల విక్రయాలకు సంబంధించి సీజన్ ఆరంభం నుంచి పూర్తి వివరాలతో నివేదిక తెప్పిస్తామని, తదుపరి చర్యలకు సిఫారసు చేస్తామని ఆయన తెలిపారు. ఇన్‌వాయిస్‌ల మార్పిడిపై కూడా విచారణ నిర్వహిస్తామన్నారు. అయితే నకిరేకల్ సింగిల్‌విండో చైర్మన్ మాత్రం సదరు ఎరువులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, సొసైటీకి కేటాయించిన ఎరువులు పక్కదారి పట్టలేదని ఆయన వివరణ ఇచ్చారు. విచారణ కమిటీ సింగిల్‌విండో ఎరువుల రికార్డులను, అదేవిధంగా ఫర్టిలైజర్ దుకాణం రికార్డులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశించారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరా

సొసైటీ యూరియా పక్కదారి పట్టిన విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులతో పాటు ఎరువుల దుకాణాల నిర్వాహకులు, సింగిల్‌విండో సీఈవోలు ఆరా తీశారు. విషయం బయటికి ఎలా వెళ్లిందనే అంశంపై ఒకరినొకరు ఫోన్లు చేసుకొని తెలుసుకున్నారు. తీగలాగితే డొంక కదిలినట్లు ఈ వ్యవహారంతో జిల్లాలో యూరియా పక్కదారి పడుతున్న విషయం వెలుగులోకి వచ్చిందని, అధికార యంత్రాంగం, విజిలెన్స్ అధికారులు సైతం అప్రమత్తమై సింగిల్‌విండో కౌంటర్లు, ఎరువుల దుకాణాల వద్ద విక్రయాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవని, ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు
ప్రణాళిక సిద్ధం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో గతంలో ఉన్న మార్గదర్శకాలను తొలగించి నూతన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 234ను జారీ చేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- » నూతన మార్గదర్శకాలు విడుదలచేసిన ప్రభుత్వం
- » 2025-26 ఆర్థిక సంవత్సరానికి పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు
- » ఉమ్మడి జిల్లాకు రూ.6.18కోట్లు మంజూరు
- » వచ్చే నెల 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- » సెప్టెంబరు 7 నుంచి 17 వరకు పరికరాల పంపిణీ

గతంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్య వసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికీ ఈ పథకాన్ని కొనసాగిస్తూ నిర్ణయం తీసకుంది. ఈ పథకం అమలు కోసం రూ.6.18కోట్లను కేటాయించింది. అందులో నల్లగొండ జిల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.1.84కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24 కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను ఈ పథకానికి కేటాయిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తించనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పథ కం అమలు ఆలస్యం కావడంతో బడ్జెట్ కేటాయింపులు చేయలేకపోయారు. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని వానాకా లం నుంచి యాసంగి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు.

వచ్చే నెల 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ...

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసా య యాంత్రీకరణ పథకానికి సంబంధించి వచ్చే నెల 5 నుంచి 15వ తేదీ వరకు రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకుంటా రు. గతంలో దరఖాస్తు చేసిన రైతులను సైతం పరిగణనలోకి తీసుకుంటారు. వ్యవసాయాధికారులు అన్ని దరఖాస్తులను కలెక్టర్లకు నివేదిస్తారు. కలెక్టర్లు ఆగస్టు 16 నుంచి 20వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. ఒకవేళ దరఖాస్తు ను తిరస్కరిస్తే అందుకు సంబంధించిన కారణాన్ని రైతులకు తెలియజేస్తారు. ఆగస్టు 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలు తీసుకుంటారు. 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు మంజూరు ఉత్తర్వులు ఇస్తారు. సెప్టెంబరు 7 నుంచి 17వ తేదీలోగా రైతులకు పరికరాలు పంపిణీ చేస్తారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ...

- మిగతా 8వ పేజీలో...

నూతన మార్గదర్శకాలతో పథకం అమలు



రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు వెల్లడించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలుచేస్తాం. ప్రభుత్వం విధివిధానాలను వెల్లడించింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగంకానుంది. ఆధునిక పరికరాలతో వ్యవసాయం చేయడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. ఆగస్టు 5వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకొని లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి సెప్టెంబరు 17లోగా యాంత్రీకరణ పరికరాలు అందజేస్తాం. అర్హులైన ప్రతీ రైతుకు ఈ పథకాన్ని వర్తింపజేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ రైతులకు 50శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీ అందజేస్తాం.
- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా?

కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులకు చోటు ఎలా కల్పిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. మండలానికి 458 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో 172 మంది అనర్హులకు జాబితాలో చోటు కల్పించారని మండిపడ్డారు. మరోసారి క్షేత్రసాయిలో పరిశీలించి కొత్త జాబితా రూపొందించాలని, ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్‌కు ఆదేశించారు. ఇళ్లు మంజూరై నిర్మించుకోలేని వారికి మహిళా సంఘాల నుంచి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. ఇంటిని నిర్మించుకోవడం ఇష్టం లేని వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ని పరిశీలించి ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించేందుకు స్థలాన్ని సేకరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శత్రునాయక్, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న ఉన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

నల్లగొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో భావితరాల కోసం ప్రతీ చోట మొక్కలు నాటాలని, అంతేగాక క్రమం తప్పకుండా నీరుపోసి కాపాడాలన్నారు. మహిళలు బాగా చదువుకొని పరిస్థితులకు తగ్గట్టుగా స్పందించాలన్నారు. మహిళ దృఢంగా ఉంటే ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కరించుకోవచ్చన్నారు. మహిళా డిగ్రీ కళాశాలను అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత మార్చిలో డిజిటల్ తరగతులు ప్రారంభించామని, బయోటెక్నాలజీ వంటి కొత్త కోర్సులు ప్రవేశపెడతామన్నారు. కనగల్, తిప్పర్తిలో జూనియర్ కళాశాలలు ప్రారంభిస్తామన్నారు. జూనియర్ కళాశాల స్థాయిలో మధ్యలో చదువు నిలిపివేసిన వారు, ఇతరులు నేరుగా రామగిరి డిగ్రీ కళాశాలలో చేరవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష రేపు

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): జిల్లాలో ఈనెల 27న నిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారుల పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9గంటల వరకే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని, 10గంటల తరువాత ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు రెండు పాస్‌ఫొటోలు తీసుకురావాలని, ఒకటి హాల్‌టికెట్‌పై అతికించాలని, మరొకటి నామినల్‌రోల్స్ కోసం అవసరం ఉంటుందన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఐడీ కార్డు తీసుకురావాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించేది లేదన్నారు.

నేరాల అదుపునకు దృష్టి సారించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావసరాలకు అనుగుణంగా పోలీసుశాఖ పారదర్శకంగా సేవలందిస్తూ మన్ననలు పొందాలన్నారు. పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. నేరం చేసేవారికి శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా సమర్థ సేవలు అందించాలన్నారు. పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు నివారణకు పెట్రోలింగ్ పెంచాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్‌ల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, డీసీఆర్బీ డీఎస్పీ రవి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నియంత్రణకు చర్యలు

జిల్లా టీబీ నివారణ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

నాగార్జునసాగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీబీ వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. శుక్రవారం సాగర్‌లో అర్బన్ ఫ్యామిలీవెల్ఫేర్ సెంటర్, బస్తీ దవాఖానాలను ఆయన తనికీచేశారు. బస్తీ దవాఖానాల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీబీ రోగులకు న్యూట్రీషన్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ ఒకరి నుంచి ఒకరికి సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 13 ఆర్‌బీఎస్‌కే వాహనాలను, మూడు 102 వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎన్జీవోల సహకారంతో పోషక విలువలున్న న్యూట్రీషన్ కిట్‌లను రోగులకు అందజేయడంతో పాటు నెలకు రూ.1,000 నగదును అందజేస్తున్నామన్నారు. ఆయన వెంట అర్బన్ సెంటర్ సిబ్బంది గంగాబాయి, లింగయ్య, తిరుమలాచారి, బాలరాజు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



కుక్కడం కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో బొల్లారం భిక్షపతి

డీఈవో భిక్షపతి

మాడ్గులపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని కుక్కడం గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో అందిస్తున్న ఆహారం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల బోధనాభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని, విద్యార్థులు చదువుతోపాటు సమాజిక అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌వో వసంత, సిబ్బంది సునీత ఉన్నారు.

ఉమ్మడి జిల్లా స్పెషలాఫీసర్‌గా అనితా రామచంద్రన్



నల్లగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి అనితా రామచంద్రన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనితా రామచంద్రన్ నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగనున్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆమె పర్యవేక్షిస్తారు. గతంలో ఆమె యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు.

ఆలోచనల్లో మార్పు రావాలి

వివాహేతర సంబంధాలు వివాహ వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. నాతిచరామి అంటూ ముడిబడిన బంధాలు చిన్నపాటి గొడవలు, మన స్పర్థలకే దూరంకావడం, మృత్యువును కోరుకునే వరకు వెళ్తున్నాయి. ఈ విషసంస్కృతి పల్లెలకు పాకడం మరింత ఆందోళనకరమని, నానాటికీ విలువలు పతనమవుతున్నాయని, భార్యాభర్తల ఆలోచనల్లో మార్పు రావాలంటున్నారు సామాజిక వేత్తలు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు పిల్లల జీవితాలతో పాటు సమాజంపై చెడు ప్రభావాన్ని చూపిస్తున్నాయన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

కుటుంబాలను బలిచేసుకుంటున్నారు



ఆకర్షణకు లోనై బాధ్యతలు విస్మరించి హత్యలకు పాల్పడుతున్నారు. జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవడంతో పిల్లలు అనాథలుగా మారుతున్నారు. వ్యసనాలకు బానిసలై ఆర్థికంగా చితికి మనస్పర్థలు ఏర్పడి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.కుటుంబాలపైనే కాకుండా సమాజంపై కూడా చెడు ప్రభావం పడుతోంది. ఆక్రోశానికి లోనుకాకుండా, షీటీం, స్వచ్ఛంద సంస్థల ద్వారా కౌన్సిలింగ్ తీసుకోవాలి.

బండారు జయశ్రీ, జిల్లా బాలిక రక్షణ సమితి కమిటీ చైర్మన్

ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో..



ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో మనస్పర్థలు ఏర్పడి, అహంతో క్షణకావేశానికి లోనై హత్యలకు దారితీస్తున్నాయి. మద్యానికి బానిసలై విధులను విస్మరించి భార్యలను వేధింపులకు గురిచేయడం ఇలాంటి సంఘటనలకు ఆజ్యం పోస్తున్నాయి.

బట్టుపల్లి అనురాధ,ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి

శాస్త్రం మేరకు కల్యాణం జరగాలి



వివాహం అనేది ఒక పవిత్రమైన ఘట్టం. అది వేదోక్తంగా జరగాల్సిన ప్రక్రియ. కానీ ఈ మధ్య పెళ్లికి ముందే ప్రీవెడ్డింగ్ పేరుతో షూట్ చేయడం సరికాదు. మరికొన్ని సందర్భాల్లో కలిసి జీవిస్తున్నారు. ఇవి ఇద్దరి మధ్య ప్రేమానురాగాలను పెంపొందించవు. చిన్న చిన్న విషయాలకే సఖ్యత చెడిపోవడం, దాంపత్యంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోలేక చివరకు విడాకులను దారితీస్తున్నాయి. శాస్త్రం చెప్పిన విధంగా వివాహ ప్రక్రియ జరిగితే వధూవరుల మధ్య మంచి సఖ్యత ఉంటూ కుటుంబాల్లో కలహాలు రాకుండా సంతోషంగా ఉంటారు.

శంకర్‌శర్మ, పురోహితులు, యాదగిరిగుట్ట

సంస్కృతీ, సంప్రదాయాలపై అవగహన లేకనే..



విద్యార్థిదశ నుంచే భారత సంస్కృతీ, సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, ఇతిహాసాలపై అవగాహన కల్పించాలి. చిన్నప్పటి నుంచి చదువుల పేరుతో కుటుంబాలకు దూరంగా హాస్టళ్లలో ఉంచడంతో అనుబంధాల విలువ తెలియడం లేదు. సమాజం అంటే తెలియకుండా కేవలం డబ్బు సంపాదనకే చదువుల మోజులో పడుతున్నారు. నిండు నూరేళ్లు కలిసి ఉంటామని చేసిన బాసలకు నీళ్లొదులుతున్నారు.

- శ్రీనివాస్‌నాయుడు, ఏసీపీ

బిల్ బుక్ లొల్లి

- సూర్యాపేట పేట మునిసిపల్‌లో రశీదు బుక్ మాయంపై ఉద్యోగులపై వేటు
- ఇచ్చానంటున్న సతీష్
- ఇవ్వలేదంటున్న ఆర్‌వో కల్యాణి

సూర్యాపేట మునిసిపల్ కార్యాలయంలో కొంతమంది వ్యవహార తీరు విమర్శలకు తావిస్తోంది. వారి మాటే వేదంగా నడుస్తోంది. దీంతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. రశీద్ బుక్, హ్యాండిల్ మిషన్ అప్పగించలేదని ఇద్దరు మునిసిపల్ ఉద్యోగులను సస్పెండ్ చేశాడు. లోతుగా విచారణ చేయకుండానే ఉద్యోగులపై వేటువేశారన్న వాదన బలంగా వినిపిస్తోంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

మునిసిపాలిటీలో పనిచేస్తున్న సొడం సురేష్ కొన్ని రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యారు. ఆయన దగ్గర నల్లా బిల్లులకు సంబంధించిన రశీదు బుక్, హ్యాండిల్ మిషన్ ఉన్నాయి. సాధారణంగా ఏరోజు వసూలు చేసిన పన్నులను ఆ రోజే మునిసిపల్ కార్యాలయంలో జమచేయాలి. అయన జమచేయకపోవడంతో ఇన్‌చార్జి ఆర్‌వో కళ్యాణి సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్‌కు బిల్లు కలెక్టర్ సురేష్ దగ్గర ఉన్న రశీదు బుక్, హ్యాండిల్ బుక్ తీసుకురావాలని ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన మౌఖికంగా తెలిపారు. దీంతో బూర సతీష్ మరుసటి రోజు సురేష్ ఇంటికి వెళ్లి రశీదు బుక్, హ్యాండిల్ మిషన్ తీసుకువచ్చి ఇన్‌చార్జి ఆర్వోకు అప్పగించారు. ఆ సమయంలో మునిసిపాలిటీలో పనిచేసే చిన్నరాజు అనే వ్యక్తి కూడా అక్కడే ఉన్నారు. అయితే రశీదు బుక్ మాయమైంది. ఇది ఎవరు మాయం చేశారో మిస్టరీగా మారింది. ఉద్యోగుల మధ్య విభేదాలతో కూడా ఎవరైనా మాయం చేసి ఉండవచ్చుననే వాదన వినిపిస్తోంది. మొత్తం మీద మునిసిపాలిటీలో ఒకరిపై ఒకరు నిఘా పెట్టుకుంటున్నారు. సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్ హ్యాండిల్ మిషన్‌ను మాత్రం ప్రభాకర్ అనే వ్యక్తికి ఇన్‌చార్జి ఆర్వో కళ్యాణి ఆదేశాల మేరకు అందజేశారని తెలిపారు. నల్లా బిల్లు వసూలుకు సంబంధించిన రశీదు పుస్తకం(మనీవాల్యూ)267 మాయమైంది. ఈ పుస్తకాన్ని తాను ఇన్‌చార్జి ఆర్వో కల్యాణికి అందజేశానని సతీష్ పేర్కొన్నారు. అయితే తనకు పుస్తకం రాలేదని, హ్యాండిల్ మిషన్ కూడా ఇవ్వలేదని ఇన్‌చార్జి ఆర్వో కల్యాని తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానిమిచ్చారు. అయితే నల్లా బిల్లులు వసూలు చేసిన నగదులో తప్పుడు లెక్కలు చేసి రూ.4,400 తక్కువగా మునిసిపాలిటీలో జమ చేసినందుకు మునిసిపల్ రెగ్యులర్ వాటర్ సప్లయి సొడం సురేష్‌ను కూడా సస్పెండ్ చేశారు.



సూర్యాపేటలోని మునిసిపల్ కార్యాలయం

ఆడిట్‌లో వెలుగులోకి..

నల్లాబిల్లుల వసూల్‌కు సంబంధించి నగదు తక్కువగా ఉండడమే కాకుండా అసలు రశీదు బుక్ లేకపోవడాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారు. దీంతో అప్పటి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదుచేశారు. ఆయన దీనిపై విచారణకు ఆదేశించారు. నేటికి రశీదు బుక్ ఎవరు దొంగిలించారో కూడా తెలియలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం రాలేదు. తాను రశీదు బుక్‌ను ఆర్వో కల్యాణికి ఇచ్చానని సతీష్ చెబుతుండగా ఇవ్వలేదని కల్యాణి పేర్కొంటున్నారు. ఇదంతా లిఖితపూర్వకంగా లేకపోవడంతో దర్యాప్తు కూడా సమస్యగా మారింది. మొత్తం మీద ఎక్కడ తప్పు జరిగిందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అధికారులు లోతుగా దర్యాప్తు చేసి నిజనిజాలను కనిపెట్టాలని మునిసిపల్ సిబ్బంది కోరుతున్నారు.

కోదాడ మాజీ ఎంపీపీ గెస్ట్‌హౌస్ వద్ద ఆందోళన

కోదాడ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి గెస్ట్‌హౌస్‌లోకి వెళ్లి కొందరు ఆందోళనకు దిగారు. మాజీ ఎంపీపీ కవిత గుడిబండ గ్రామంలో తమ స్థలాన్ని ఆక్రమించి గెస్ట్‌హౌస్ నిర్మించారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన మాధవరపు వీరస్వామి, మాధవరపు ముత్తయ్య, మాధవరపు వెంకయ్య, మాధవరపు గురవయ్య, మాధవరపు సూరయ్య కుటుంబసభ్యులు మాజీ ఎంపీపీ ఇంటి ముందు ఉన్న గెస్ట్‌హౌస్‌లోకి శుక్రవారం వెళ్లి బైఠాయించారు. ఇది తమ స్థలమని అప్పగించాలని డిమాండ్ చేశారు. తమకు కోర్టు తీర్పు కూడా అనుకూలంగా ఉందన్నారు. దీంతో మాజీ ఎంపీపీ కవిత పోలీసులకు సమాచారమిచ్చారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ గోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఎంపీపీ తమ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని పోలీసులకు ఆందోళనకారులు వివరించారు. కోర్టు తీర్పు కాపీలు అందజేశారు. ఈ విషయంపై ఎంపీపీ చింతా కవితారెడ్డి మాట్లాడుతూ వివాదంలో ఉన్న ఇంటిపై హైకోర్టు స్టే ఉందన్నారు. తన ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించారని ఆమె ఆరోపించారు. గతంలో ఈ భూమి మొత్తం కూడా మాధవరావు లక్ష్మయ్య తమకు విక్రయించారన్నారు. హైకోర్టు స్టే ఉండగా అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించారని ఆరోపించారు. పోలీసులు ఇరువర్గాలను బయటకు పంపించి గెస్ట్‌హౌస్‌కు తాళంవేశారు. కోర్టులో కేసు తేలేవరకూ ఎవరూ ఇంట్లోకి వెళ్లవద్దని ఇరువర్గాలను ఆదేశించారు.



గెస్ట్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

అధికార పార్టీ అండదండలతోనే దౌర్జన్యం : కవిత

అధికార పార్టీ అండదండలతోనే తమ ఇంటి గేటు పగులగొట్టి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించారని మాజీ ఎంపీపీ కవిత ఆరోపించారు. గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. తాను ఎవరి స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించలేదని, గ్రామానికి చెందిన కొంతమంది ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఇంటిపై ఎవరికీ ఎటువంటి హక్కులు లేవని, ఇందుకు సంబంధించి హైకోర్టు స్టే ఆర్డర్ కూడా ఉందన్నారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులున్నారు.

బాలకార్మికులకు విముక్తి

- బడిలో చేర్పించిన ముస్కాన్ బృంద సభ్యులు



మంతపురిలోని ప్రాథమిక పాఠశాలలో బాలకార్మికులను చేర్పిస్తున్న ముస్కాన్ టీం

ఆలేరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కోళ్లఫాంలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించిన యాదాద్రిభువనగిరి జిల్లా ముస్కాన్ టీం వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పోలీస్ బృందం మంతపురి గ్రామశివారులోని కోళ్లఫాంలో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన నలుగురు పిల్లలను ఈ నెల 17న గుర్తించారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు ముస్కాన్ టీం ఇన్‌చార్జి ఎస్ఐ బానావత్ ఆనంద్‌నాయక్ ఆధ్వర్యంలో ఆ పిల్లలను మంతపురి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆ చిన్నారులకు తమ సొంత ఖర్చులతో స్కూల్ బ్యాగ్స్, పెన్నులను అందజేశారు. ముస్కాన్ టీం సభ్యులను ఉపాధ్యాయులతో పాటు గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ బండారి ప్రశాంత్, రాజునాయక్, రవితేజ, అశోక్, ఉమెన్ కానిస్టేబుల్ కృష్ణ, భవాని, పిల్లల సంక్షేమ శాఖ అధికారి హరిబాబు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు అశ్విని, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సూపర్‌ఫాస్ట్‌గా మారిన శబరి ఎక్స్‌ప్రెస్

సెప్టెంబరు 29 నుంచి సేవలు

మిర్యాలగూడ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న భారతీయ రైల్వే ఇప్పటికే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా ఆధునీకరిస్తోంది. అంతేగాక ప్రయాణికులకు సౌకర్యం, వేగవంతమైన సేవలందించేందుకు అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తోంది. కొత్త ఆలోచనలతో, సరికొత్త ప్రయోగాలతో సాగుతున్న సౌత్ సెంట్రల్ రైల్వే శబరీ ఎక్స్‌ప్రెస్‌ను సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. 38 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని నుంచి కేరళ రాజధానికి పరుగులు పెట్టే శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతి మీదుగా ప్రయాణిస్తుంది.

ఆర్థిక సంవత్సర ముగింపు నాటికి

సికింద్రాబాద్ నుంచి కేరళలోని తిరువనంతపురం వరకూ నడిచే శబరి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 29 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా పరుగులెట్టనుంది.ఈ మేరకు రైల్వే బోర్డు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రమైన నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలను తాకుతూ కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం చేరుకుంటుంది.



ఆధునిక హంగులు అద్దుకుంటున్న మిర్యాలగూడ రైల్వే స్టేషన్

మారనున్న ట్రైన్ నెంబర్లు

ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా అప్‌గ్రేడ్ అయిన శబరి ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్లు మారనున్నట్లు అధికారులు తెలిపారు. శబరి ఎక్స్‌ప్రెస్ బండి పాత నెంబరు 17229/17230గా ఉండగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారిన పిదప సదరు రైలు నెంబరు 20629/20630గా మార్పుచేశారు. అధికారులు. ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్‌ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ అయిన తరుణంలో రాకపోకల సమయాల్లో కాస్త మార్పు ఉండొచ్చని, రైలు ప్రయాణించే రూట్లలో మాత్రం ఎటువంటి మార్పు ఉండదని రైల్వే అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుడు కొట్టాడని..విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కొండమల్లేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టాడని విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. గురువారం సాయంత్రం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామపంచాయతీలోని రాజ్యాతండాకు చెందిన రమావత్ సంతోష్(12) కొండమల్లేపల్లిలోని సాయిసిద్ధార్థ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం పాఠశాల వదిలి పెట్టిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. వ్యాన్‌లో ఎక్కడానికి విద్యార్థులు గుంపులు గుంపులుగా వస్తుండడంతో, వరుస క్రమంలో రావాలని అక్కడే విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు కొర్ర చందునాయక్ కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ ఇంటికి వెళ్లి పత్తి చేలో కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంట్లో ఉన్న సోదరి చూసి పొలంలో పని చేస్తున్న తల్లిదండ్రులకు చెప్పడంతో సంతోష్‌ను హుటాహుటిన దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంతోష్ తండ్రి పాఠశాల నిర్వాహకులకు సమాచారమివ్వడంతో ఆస్పత్రి ఖర్చులు భరించేందుకు అంగీకరించి మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

వలిగొండలో పురుగుల మందు తాగి యువకుడు .

వలిగొండ : పురుగుల మందు తాగి ఓ యువకుడి ఆత్మహత్యాయత్నం చేశాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన మర్రిసతీష్ వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆయనను వెంటనే భువనగిరి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

తిప్పర్తిలో వివాహిత ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

తిప్పర్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : తిప్పర్తిలో రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వివాహితను తిప్పర్తి పోలీసులు కాపాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన పాతులోతు నవ్యశ్రీ(20) శుక్రవారం ఉదయం 10-30 గంటల సమయంలో అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతోంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే వారు అక్కడికి చేరుకొని మహిళను తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ చేశారు.

అనంతరం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా అక్కడ నుంచి సఖీ కేంద్రానికి తరలించినట్లు సమాచారం. మహిళ ఆత్మహత్యాయత్నానికి కుటుంబ కలహాలే కారణమని ప్రాథమిక సమాచారం. నవ్యశ్రీకి 8 నెలల పాప ఉంది.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇరు కుటుంబాల ఘర్షణ

- పంచాయితీ పరిష్కరించుకునేందుకు వచ్చి వివాదం

సంస్థాన్‌నారాయణపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు పోలీసుస్టేషన్‌కు వచ్చిన వారి కుటుంబీకులు ఒకరికొకరు దాడి చేసుకున్న వీడియో సోషల్‌మీడియా వైరల్ అయింది. ఈ నెల 23వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని బోటిమీదితండాకు చెందిన భార్యాభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ విషయమై ఇరు కుటుంబాల సభ్యులు కొంతకాలంగా గొడవ పడుతున్నారు. ఈ ఘటనపై భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ఈ నెల 23వ తేదీన ఇరు కుటుంబాలకు చెందినవారు పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. పెద్ద మనుషులతో మాట్లాడుకోవాలని పోలీసులు సూచించడంతో వారు మాట్లాడుకుని వివాదాన్ని పరిష్కరించుకున్నారు.

ఈ క్రమంలో ఇరు కుటుంబాలకు చెందిన ఒకరినొకరు దూషించుకోగా, మాటా మాటా పెరిగింది. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఘర్షణ జరుగుతుండడంతో పోలీసులు బయటకు వచ్చి ఘర్షణ పడుతున్న వారిని చెదరగొట్టారు. దాడికి కారణమైన రాందాసు, లచ్చిరాం, రాజేష్‌పై పోలీసులు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

15 మంది ద్విచక్రవాహనాల దొంగల అరెస్ట్

హాలియా, జూలై 25 (ఆంధ్రజ్యోతి):ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. శుక్రవారం హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 19, 22 తేదీల్లో హాలియా బస్టాండ్ వద్ద పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. ఈ ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న హాలియా ఎస్ఐ, సిబ్బంది అలీనగర్ చెక్‌పోస్టు వద్ద, అనుముల ద్వారకాపురి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. మహ్మద్‌జానీ, దేపనబోయిన శ్రీను, వేముల నాగరాజు అనుమానాస్పదంగా సరైన వాహన కాగితాలు లేకుండా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు 10ద్విచక్రవాహనాలను చోరీచేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ద్విచక్రవామనాలను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులు హాలియా, నిడమనూరు, హైదరాబాద్‌లోని ఆదిబట్ల, మిర్యాలగూడ, మాచర్ల, గుంటూరు, రెంటచింతల, కారంపూడి ప్రాంతాల్లో ఆర్‌టీసీ బస్టాండ్లలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలకు నకిలీ తాళాలు చేయించి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు మహ్మద్‌జానీ నుంచి ఆరు, దేపనబోయిన శ్రీను, వేముల నాగరాజు నుంచి నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనుముల మండలం అలీనగర్‌లో మహ్మద్‌జానీ ట్రాక్టర్ డ్రైవర్‌గా, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్ గ్రామానికి చెందిన దేపనబోయిన శ్రీను, వేముల నాగరాజులు వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు.

- త్రిపురారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబుసాయి క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ, సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా ఆరుగురు ద్విచక్రవాహనాలపై వస్తూ పోలీసులను చూసి తిరిగి పారిపోయే ప్రయత్నం చేశారని ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. వారి నుంచి 10 ద్విచక్రవాహనాలు, ఏడు సెలఫోన్లు, 2 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో రమావత్ వంశీ, కుర్ర తుల్యాలది అడవిదేవుపల్లి మండలం బాలెంపల్లి కాగా, నాగార్జునసాగర్‌లోని ఫైలాన్‌కాలనీకి చెందిన కొల్లపూడి వంశీ, దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ధీరావత్ వంశీ, మునోతు కిరణ్, హైదరాబాద్‌లోని తుర్కయంజల్ ప్రాంతానికి కనపర్తి ప్రవీణ్‌లుగా తెలిపారు. కేసును ఛేదించిన హాలియా సీఐ దేవిరెడ్డి సతీష్‌రెడ్డి, హాలియా ఎస్ఐ సాయిప్రశాంత్, త్రిపురారం ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది సురేష్, హరిప్రసాద్, రమేష్‌గౌడ్, శ్రవణ్, శివరాజ్, సుభాష్, నాగరాజు, రవి, శ్రీనివాస్, రాము, జానీపాషా, రఫీలను ఎస్పీ అభినందించారు. ఆయన వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నకిలీ మద్యం కేసులో మరో ఏడుగురు ..

హుజూర్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో నకిలీ మద్యం కేసులో తాజాగా ఏడుగురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ స్టిఫెన్‌సన్, ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానికసంస్థల ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మేళ్లచెర్వు మండలం రామాపురంలో అదే గ్రామానికి చెందిన తోట శివశంకర్, సూర్యప్రకాశ్‌రావులు నకిలీ మద్యం తయారు చేశారని, వారిని మూడురోజుల కిందట అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న రామాపురం గ్రామానికి చెందిన డీలర్ నర్సింహారావు, రంగిశెట్టి సైదేశ్వరరావు, భీమన ప్రవీణ్, కొట్టె నాగసైదేశ్వరరావు, రంగిశెట్టి వీరభద్రరావు, కీత నాగార్జునరావులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం ప్రకాశం జిల్లా కందుకూరులో ప్రాంతంలో నకిలీ మద్యం పట్టుబడగా అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు రామాపురంలోని తోట శివశంకర్, సూర్యప్రకాశ్‌రావుకు సంబంధించిన స్థలాలపై గ్రామంలో ఈ నెల 21న దాడులు చేశామన్నారు. ఇదే కేసులకు అనుసంధానంగా తోట శివశంకర్, రంగిశెట్టి సైదయ్యలు రామాపురంలో డీలర్ నర్సింహారావుకు 150 కార్టన్ల నకిలీ మద్యం విక్రయించగా ఆ మద్యాన్ని సైదీ పొలంలో పాతిపెట్టినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి 30 కాటన్లు స్వాధీనం చేసుకోగా 120 కాటన్ల నకిలీ మద్యాన్ని భూమిలోనే ధ్వంసం చేశామన్నారు. వీరితో పాటు రంగిశెట్టి సైదేశ్వరరావు ఇంట్లో ఆరు కాటన్ల నకిలీ మద్యాన్ని, సైదీ స్నేహితుడైన ప్రవీణ్, నరేష్ నివాసాల్లో 30లీటర్ల స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులకు సంబంధించి మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. కాగా స్పిరిట్ సరఫరా చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన రుతుల శ్రీనివాస్, శివచరణ్‌సింగ్‌లు ఆంధ్రప్రదేశ్ నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉండగా వారిని ఈ కేసుల్లో కూడా తెలంగాణలో రిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. సుమారు రూ.40 లక్షల విలువచేసే నకిలీ మద్యాన్ని సీజ్ చేశామన్నారు. ఇదిలా ఉండగా కేసులో నిందితులుగా ఉన్న శివశంకర్, ప్రవీణ్‌లు మేళ్లచెర్వు, దొండపాడు మద్యం దుకాణాల్లో పనిచేస్తూ నకిలీ మద్యం దందా చేస్తున్న నేపథ్యంలో వారికి సంబంధాలు కలిగి ఉండడంతో మేళ్లచెర్వు మద్యం దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దొండపాడు దుకాణాన్ని కూడా రెండురోజులలో సీజ్ చేస్తామన్నారు. దాడులలో ఎక్సైజ్ అధికారులు జగన్మోహన్‌రెడ్డి, వెన్నెల, రామకృష్ణ, రుక్మారెడ్డి, ధనుంజయ్, నాగరాజు, రవి, మధు, నాగయ్య, గోపిరెడ్డి, బాలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

సంతకం ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్టు

సంస్థాన్‌నారాయణపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ అధికారి సంతకాల ఫోర్జరీ కేసులో సంస్థాన్ నారాయణపురం మండలంలో పోలీసులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. సంస్థాన్‌నారాయణపురం పట్టణానికి చెందిన గవ్వల సందీప్ మండల కేంద్రంలో మీ సేవ కేంద్రం నిర్వహిస్తున్నాడు. అందులో చిల్లాపురం గ్రామానికి చెందిన నెరుగు శేఖర్ పనిచేస్తున్నాడు. అయితే ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం సాయం కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో గెజిటెడ్ అధికారి చేయించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే సమయంలో మండల వైద్యాధికారిని సంప్రదించకుండానే సంతకాన్ని ఫోర్జరీ చేశారు. ఇటీవల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఆర్డీవో అధికారులు తనిఖీ చేశారు. ఆ తనిఖీలో సంతకాలను పరిశీలించి వైద్యాధికారిని విచారించారు. విచారణలో సంతకాల ఫోర్జరీ జరిగినట్టు తేలడంతో వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి ఫోర్జరీకి ఉపయోగించిన స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై కేసు

యాదగిరిగుట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహా స్వామి దేవస్థాన పరిధిలో శుక్రవారం పోలీసులు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కొండకింద లక్ష్మీపుష్కరిణి చెంత సులబ్ సిబ్బంది మద్యం తాగి చిందులు వేసిన వీడియో శుక్రవారం వైరల్ అయ్యింది. ఈ మేరకు సంబంధిత వ్యక్తులను తక్షణమే పోలీసులకు అప్పగించాల్సిందిగా ఈవో ఎస్. వెంకట్రావు దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించగా యాదగిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఘటనకు సంబంధించి విడియోను విచారించి 10 రోజుల క్రితం జరిగినట్లుగా గుర్తించిన పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు. కాగా, బిల్ పే అండ్ ఆపరేటింగ్ పద్ధతిలో సులబ్ నిర్వాహకులు బస చేసేందుకు పుష్కరిణి వద్ద కేటాయించిన గదిలో మద్యం సీసాలతో డాన్స్‌లు చేశారు. అందులో పనిచేసే సిబ్బందికి సంబంధించిన వీడియో అలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా, సంస్థ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి పవిత్ర స్థలంలో అసాంఘీక కార్యకలాపాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఈవో అధికారులను ఆదేశించారు.

వరిలో యాంత్రీకరణ బహుదూరం


సంప్రదాయ పద్ధతిలో నారు మడిలో విత్తనాలు వెదజల్లుతున్న దృశ్యం

వరి నాట్లలో కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణ పద్ధతులను వ్యవసాయ నిపుణులు రూపొందించారు. రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపినా ఆశించిన ఫలితాలు సాధించ లేకపోయారు. వరి నాట్లలో ఇప్పటికే సంప్రదాయ పద్ధతినే రైతులు నమ్ముకున్నారు. వరిలో నాట్లలో వచ్చిన యాంత్రీకరణ పద్ధతులు వాటి వల్ల ఏర్పడే లాభనష్టాలపై కథనం..

– (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ వ్యవసాయం)

నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధి కింద 6.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా 80శాతం మేర వరి నారు పోసుకుని కూలీలతో నాట్లు వేసే పద్ధతిని పాటిస్తున్నారు. 20శాతం మేర యంత్రంతో వరి నాటు, వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్, మెట్ట వరి, శ్రీ వరి వంటి అధునాతన పద్ధతులతో వరి సాగు చేస్తున్నారు.

కూలీలతో వరి నాట్లు



నేను 30 ఎకరాల్లో వరి సాగు చేస్తాను. సాధారణ నాటు పద్ధతిలో కూలీల కొరత ఉండటంతో వివిధ పద్ధతుల్లో నాట్లు వేశాను. యాజమాన్యంలో సమస్యలు ఎదుర్కొంటున్నాను. కొంత మేరకు నష్టం వాటిల్లింది. పాత పద్ధతిలో కూలీల ద్వారా నాట్లు వేయిస్తున్నాను.

– సారెడ్డి సత్యనారాయణరెడ్డి,వి.అన్నారం,మిర్యాలగూడ

శ్రీవరి ▸▸ వరి సాగులో శ్రీ వరి సాగు ప్రాచుర్యంలోకి వచ్చింది. సాధారణ పద్ధతిలో ఎకరం వరి సాగుకు 15-20 కిలోల వరకు విత్తనం అవసరమవుతుంది.

- శ్రీవరి పద్ధతిలో ఎకరం నాటు వేయడానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది.
- వరి నారు 8-12 రోజుల వయస్సు గల రెండు ఆకుల నారును వాడాలి.
- నారు మడి నుంచి మొక్కను జాగ్రత్తగా తీసి బురద పొలంతో పైన నాటాలి. ఈ పద్ధతిలో పిలకలు బాగా వస్తాయి.
- మొక్కకు మధ్య దూరం 25 సెం.మీ ఉండే విధంగా నాటాలి.
- పొలంలో నీటిని నిల్వ ఉంచవద్దు. కలుపు సమస్య అధికంగా ఉంటుంది. రెండు మీటర్ల ఒక కాల్వ ఏర్పాటు చేసుకోవాలి. కోనో వీడర్‌తో పది రోజులకొకసారి సుమారు మూడు సార్లు మొక్కల మధ్య కదిలిస్తే కలుపు మొక్కలు బురదలో కలిసిపోతాయి.
- ఈ విధానంలో 60 శాతం నీరు సరిపోతుంది.

సమస్యలు: లేత వరి నారును తీయడం చాలా కష్టం. నాటు వేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరు తడి పద్ధతి వల్ల కలుపు సమస్య తీవ్రంగా ఉంటుంది. బురదలో కోనోవీడర్ నడపడం చాలా క్లిష్టమైనది. కూలీల అవసరం అధికంగా ఉంటుంది. యాజమాన్యంలో సమస్యల వల్ల రైతులు ఈ పద్ధతి వైపు మొగ్గు చూపడం లేదు.

- ▸▸ సాగులో ఎన్నో ఒడిదుడుకులు
- ▸▸ రైతుల్లో అనాసక్తత..
- ▸▸ శతాబ్దాలుగా వరి నాట్లలో పాత పద్ధతే కొనసాగింపు

ఆరుతడి వరి (ఎరోబిక్ రైస్)

- ఎరోబిక్ వరి పద్ధతిలో ఎకరానికి 8-10 కిలోల విత్తనం సరిపోతుంది. నీటి పారుదల అతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ విధానం అనువుగా ఉంటుంది.
- వర్షాధారంగా భూమిని మెత్తగా దున్ని మెట్టలోనే నేరుగా ట్రాక్టర్ యంత్రంతో విత్తుకోవాలి. ఆరు తడి పద్ధతిలో నీటిని పెట్టాలి. విత్తనం మొలకెత్తే వరకు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఈ పద్ధతిలో నీటి వినియోగం 40 రోజుల వరకు తక్కువగా ఉంటుంది. పిలక దశ నుంచి సాధారణ వరి లాగానే నీటిని పెట్టాలి. కలుపు సమస్యకు 30 రోజుల నివారణ మందును పిచికారీ చేయాలి.
- నాటు కూలీలు ఖర్చు సుమారు రూ.6వేలు, బురద పొలంలో దమ్ము చేయాల్సిన అవసరం లేదు. ట్రాక్టర్ ఖర్చులు సుమారు రూ.3వేల వరకు ఆదా అవుతుంది.

సమస్యలు: మెట్ట పద్ధతిలో విత్తనం వేసినప్పుడు భారీ వర్షాలు పడితే విత్తనం కొట్టుకుపోయి నష్టం వాటిల్లుతుంది. విత్తనం వేసినప్పటి దగ్గర నుంచి సుమారు నెల రోజుల వరకు యాజమాన్యం చాలా కష్టంగా ఉంటుంది. కలుపు సమస్య తీవ్రంగా ఉండటంతో రైతులు ఈ పద్ధతిపై ఆసక్తి చూపడం లేదు.

వెదజల్లే పద్ధతి : ఈ బురద పొలంలో మొలక కట్టిన విత్తనాలను నేరుగా చల్లవచ్చు. నాటు కూలీల ఖర్చు ఉండదు. విత్తనం 10 కిలోల వరకు సరిపోతుంది.

- సుమారు నెల రోజుల వరకు ఆరుతడి పద్ధతిలో నీటిని అందించాలి.

సమస్యలు: పొలం చదును సరిగా లేకపోతే విత్తనం మొలకెత్తదు. నెల రోజుల వరకు నీటి యాజమాన్యం చాలా క్లిష్టంగా ఉంటుంది. కలుపు సమస్య తీవ్రంగా ఉంటుంది.



యంత్రంతో నాటు: వరి నాటు యంత్రం వరినాటు యంత్రం ద్వారా నాటు వేయడానికి ఎకరానికి పది కిలోల విత్తనం పడుతుంది.

- ప్లాస్టిక్ షీటు వేసి బురద మట్టిలో విత్తనాలు వేస్తారు. 20-26 వయస్సు నారును బెడ్లుగా తీసి యంత్రంలో పెట్టి నాటు వేస్తారు.
- ఈ యంత్రంతో ఒక గంటలోనే ఎకరం నాటు వేసుకోవచ్చు.
- పిలకలు బాగా వస్తాయి. ఈ పద్ధతిలో దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.

సమస్యలు: నారు ఎత్తు తక్కువగా ఉండటం వల్ల నాటు వేసేటప్పుడు బురద మడిని చాలా చదునుగా లేక పోతే నారు మునిగిపోయి చనిపోయే ప్రమాదం ఉంది. నాటు వేసిన దగ్గర నుంచి కర్ర నిలబడే వరకు ఆరుతడి పద్ధతిలో నీరు పెట్టాల్సి రావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాత పద్ధతే మేలు..

వరి నారు పోసుకుని కూలీలతో నాటు వేయడం వల్ల నీటి యాజమాన్యం చాలా సులువుగా ఉంటుంది. ఈ పద్ధతి నాట్లు వేయడం వల్ల అధిక వర్షాలు పడినా పంట దెబ్బతినదు. అందుకే పాత పద్ధతే మేలని రైతులు చెబుతున్నారు.

తుర్కపల్లిలో కేంద్ర బృందం పర్యటన

● వివిధశాఖల పనితీరును అడిగి తెలుసుకున్న బృందం సభ్యులు


కేంద్ర బృందం సభ్యులకు మొక్కలు అందజేసి స్వాగతం పలుకుతున్న అధికారులు

తుర్కపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్, మల్కాపూర్, గంధమల్ల గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం అధికారి జుబేదాబేగం ఆధ్వర్యంలో సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చెత్త నిర్వహణ తీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ, మొక్కల సంరక్షణపై తీసుకుంటున్న శ్రద్ధ, గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పథకం నిర్వహణ, కేంద్రప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లెంకట తీతా రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో నారాయణ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ, జేజేబీ నియామకాలకు నోటిఫికేషన్

భువనగిరిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ), జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ) నియామకాలకు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేశారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం సీడబ్ల్యూసీ నియామకానికి రెండో నోటిఫికేషన్ కాగా జేజేబీ నియామకానికి ఇదే మొదటిది. దీంతో ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలకు త్వరలోనే నూతన సీడబ్ల్యూసీ, జేజేబీ రానున్నాయి. సీడబ్ల్యూసీలో ఒక చైర్‌పర్సన్, నలుగురు సభ్యులుగా ఉంటారు. వీరిలో తప్పనిసరిగా ఒక మహిళ, మరొకరు పిల్లల సమస్యల నిపుణులు ఉండాలి. జేజేబీలో ఇద్దరు సభ్యులకు గాను ఒకరు సామాజిక కార్యకర్త, మరొకరు మహిళ ఉండాలి. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న స్థానానికి ఆగస్టు 8వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏవేని రెండు పోస్టులకు ఐదు జిల్లాల పరిధిలో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ ఆధారిత స్ర్కీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూలకు అర్హులు. బాల కార్మికులు, బాల్యవివాహాలు బాధితులు, అనాథ పిల్లలు, శిశువుల ప్రయోజనాలను సీడబ్ల్యూసీ కాపాడుతుంది. చట్టపరిధిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలల న్యాయ విచారణను నిర్దేశిత న్యాయమూర్తి పర్యవేక్షణలో జేజేబీ పర్యవేక్షిస్తుంది. ఈ రెండు కమిటీల పదవీకాలం మూడు సంవత్సరాలు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌కు జ్యూడీషియల్ అధికారాలు ఉంటాయి. సిట్టింగ్స్ ఆధారంగా చైర్‌పర్సన్స్, సభ్యులకు ఒకే రీతిలో నెలవారీగా సుమారుగా రూ.45వేలు, జేజేబీ సభ్యులకు సుమారు రూ.25 వేల పారితోషికం లభించనుంది. విధి విధానాలు, అర్హతలు దరఖాస్తు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్ http://-wdcw.tg.nic.in ను చూడవచ్చని సంక్షేమశాఖ కార్యదర్శి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

నిండుకుండలా జలాశయాలు


మూసీ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న నీటి పారుదల శాఖ సూర్యాపేట డివిజన్ 1 ఈఈ వెంకటరమణ

- మూసీ రెండు క్రస్టు గేట్లు ఎత్తివేత
- 1,340 క్యూసెక్కుల నీటి విడుదల
- 579 అడుగులకు సాగర్ నీటిమట్టం
- ఎగువనుంచి 1,20,635 క్యూసెక్కుల వరద

కేతేపల్లి/నాగార్జునసాగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. నాగార్జునసాగర్ గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండగా శుక్రవారం మూసీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద తాకిడి పెరగడంతో శుక్రవారం మూసీ ప్రాజెక్టు 2 క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మూసీ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వారం రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. 645అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం కాగా, గురువారం రాత్రి 643.50 అడుగులకు చేరింది. ఎగువనుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతుండటం, ప్రాజెక్టు 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి చేరడంతో అప్రమత్తమైన అధికారులు దిగువ మూసీకి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం రాత్రి నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. శుక్రవారం ఉదయం 10సమయంలో నీటిపారుదల శాఖ సూర్యాపేట డివిజన్-1 ఈఈ వెంకటరమణ ప్రాజెక్టు 3, 8 నెంబర్ క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి 1340 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేశారు. గురువారం సాయంత్రానికి ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో 1653.2 3క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 643.50 అడుగులు(4.07టీఎంసీ)ల వద్ద నిలకడగా ఉంది.

గేట్లు ఎత్తే సమయంలో లోవోల్టేజీ సమస్య


మూసీ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే సమయంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో 2, 3 గేట్లు పైకి లేవలేదు. విద్యుత్ లోవోల్టేజీ ఉందని గ్రహించి జనరేటర్ విద్యుత్ సాయంతో ప్రాజెక్టు 3, 8నెంబరు క్రస్టుగేట్లను ఒక అడుగు మేర ఎత్తారు.

579 అడుగులకు సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 579 అడుగులకు చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు), కాగా, శుక్రవారం సాయంత్రానికి 579 అడుగులకు (280.1200 టీఎంసీలు) చేరింది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 511 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,287 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,598 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువనుంచి 1,20,635 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాల్వకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.

16 అడుగులకు డిండి రిజర్వాయర్ నీటి మట్టం

డిండి: డిండి ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 16 అడుగులకు చేరింది. గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు(2.4 టీఎంసీలు) కాగా దుందుభి వాగు నుంచి వస్తున్న వరదతో నీటిమట్టం 16 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ సాయికుమార్ తెలిపారు.



డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమావేశాన్ని శనివారం నీటి పారుదలశాఖ అతిథిగృహంలో నిర్వహిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని రైతులు ఉదయం 10 గంటలకు సమావేశానికి తప్పకుండా హాజరుకావాలన్నారు. సమావేశంలో డిండి ప్రాజెక్టు నీటి విడుదలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


చేనేత కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మునుగోడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చేనేత సహకార సంఘాల చైర్మన్లు, చేనేతరంగ ప్రతినిధులు చేనేత రాష్ట్ర నాయకుడు రాపోలు నర్సింహ నాయకత్వంలో కలిశారు. చేనేత సమస్యలను విన్నవించారు. ప్రతీ మగ్గానికి ఉన్న జియోట్యాగ్ అనుబంధ కార్మికులు ముగ్గురు ఉండే విధంగా చూడాలని కోరారు. రాష్ట్రంలోని 350 చేనేత సంఘాలకు సంబంధించి రూ.50కోట్ల రుణాలను మాఫీ చేయించడంతో పాటు కొత్త రుణాలను ఇప్పించాలని వారు కోరారు. చేనేత సహకార సంఘాలను పరిపుష్టి చేసేందుకు ఎన్నికలను నిర్వహించాలని వారు కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చేనేత కార్మిక సంఘాల నాయకులు కందకట్ల బిక్షపతి, అప్పం రామేశ్వరం, వెంకటనర్సయ్య, శ్యామల బాస్కర్, ఉప్పలయ్య , జనార్ధన్, శ్రీనివాస్, గోశిక రవి, నర్సింహ, చక్రపాణి ఉన్నారు.

వైభవంగా సువర్ణపుష్పార్చన


అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో పూజారులు వేడుకలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.19,03,882 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. వైకుంఠద్వారం వద్ద ప్రధాన కూడలిలో హనుమాన్ సర్కిల్ పేరుతో సైన్‌బోర్డు అధికారులు ఏర్పాటు చేశారు. కొండచుట్టూ ప్రధా న కూడళ్ల వద్ద విగ్రహాలను ఈవో ప్రతిపాదించినప్పటికి తాత్కాలికంగా సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అంతకు ముందు పాతగుట్ట కూడలి వద్ద గరుడ సర్కి ల్ సైన్‌బోర్డు ఏర్పాటు చేయగా మిగిలినవి శనివారం ఏర్పాటు చేయనున్నారు.

● **అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాలు**



వైకుంఠ ద్వారం కూడలి వద్ద హనుమాన్ సర్కిల్ బోర్డు

మట్టపల్లిలో లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని శుక్రవారం వేదపండితులు భక్తుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నిత్య పూజలు ఘనంగా జరిపారు. అనంతరం కల్యాణతంతు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


కట్టంగూరులో సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చిట్యాల, కట్టంగూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయికి యువత దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ అరికట్టాలని కోరుతూ చేపట్టిన సైకిల్‌యాత్ర శుక్రవారం కట్టంగూరు, చిట్యాల మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రోజురోజుకి గంజాయి, డ్రగ్స్ వాడకం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగుల ద్వారా లక్షల రూపాయాలు పోగొట్టుకుని అప్పులపాలై యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టడానికి ప్రభుత్వం కఠినచట్టాలను అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, వడ్డగాని మహేష్, గుండాల నరేష్, కట్ట లింగస్వామి, గద్దపాటి సుధాకర్, చంద్రశేఖర్, పంది నరేష్, అవిశెట్టి కిరణ్, సులోచన, వేణు, జాల ఆంజనేయులు, ముస్కు రవీందర్, చెరుకు శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చిలుకూరి లక్ష్మీనర్సయ్య

నల్లగొండరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా చేనేత సహకార సంఘాల రుణాలను మాఫీ చేయాలని చేనేత సహకార సంఘాల ఉమ్మడి నల్లగొండ జిల్లా సమన్వయ కమిటీ అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పద్మశాలీ భవనంలో శుక్రవారం నిర్వహించిన నల్లగొండ, సూర్యాపేట సహకార సంఘాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల్లో నేసిన వస్త్రాల నిల్వలు పెరిగాయని, వాటిని కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి చేనేత భరోసా కల్పించాలని కోరారు. అనంతరం వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, సహకార సంఘాల సంరక్షణ కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు గంజి మురళీధర్, సత్యనారాయణ, దత్త గణేష్, కర్నాటి యాదగిరి, పున్న వెంకటేశం, శ్రీనివాస్, కడేరు బిక్షం, గిరిధర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో కడియం రాంమోహన్ తెలిపారు. వ్యవసాయ భూముల్లో పనులు చేపట్టే వారు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూమి పాస్ జీరాక్స్, సన్న చిన్నకారు రైతు ధ్రువీకరణ పత్రం (5 ఎకరాలలోపు), ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, జాబ్ కార్డులను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌రెడ్డి



కనగల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కనగల్ ఎస్ఐగా కె.రాజీవ్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేసి బాధితులకు అండగా ఉంటానన్నారు. అంతకుముందు దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

53మందికి ఇద్దరే టీచర్లు..!

- లక్ష్మీపురం పాఠశాలలో విద్యార్థుల ఇబ్బందులు
- ఒకే గదిలో ఐదు తరగతులు
- అసౌకర్యాల నడుమ పాఠాలు
- అసంపూర్తిగా మూత్రశాలలు



ఒకే గదిలో కూర్చున్న ఐదు తరగతుల విద్యార్థులు

నార్కట్‌పల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో ఉన్న లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల అసౌకర్యాల నడుమ నడుస్తోంది. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సమతుల్యత లోపించింది. ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేని పరిస్థితి ఉంటే ఈ పాఠశాలలో మాత్రం విద్యార్థులున్నా ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉండటం గమనార్హం. ఐదు తరగతులను కలిపి ఒకే గదిలో నిర్వహిస్తూ ఉపాధ్యాయునులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాలలో మొత్తం 53 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలురు 28, బాలికలు 25 మంది ఉన్నారు. తరగతుల వారీగా పరిశీలిస్తే 1వ తరగతిలో 20, 2వ తరగతిలో 7 గురు, 3వ తరగతిలో 5 గురు, 4వ తరగతిలో 10 మంది, 5వ తరగతిలో 11 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంకా కొంత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంది.

ఒకే గదిలో 5 తరగతులు

లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలకు కేవలం ఒక్కటే తరగతి గది ఉంది. అందులోనే విద్యార్థులను కూర్చోబెట్టి ఐదు తరగతులకు పాఠాలు చెబుతున్నారు. దీంతో అన్ని తరగతులకు ఒకే గదిలో చెప్పాల్సి వస్తుండటంతో విద్యార్థుల్లో ఏకాగ్రత కొరవడుతోంది. ఉపాధ్యాయులకు కూడా కొంత అసౌకర్యంగానే ఉంది. అదనపు తరగతి గది కోసం మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సీడీపీ కోటా కింద రూ.17 లక్షల అంచనా విలువతో 18 నవంబరు 2024లో ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. కానీ కారణమేంటో తెలియకున్నా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

టీచరును డిప్యూటేషన్ చేస్తాం



లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు గుర్తించాం. గతేడాది కన్న విద్యార్థుల సంఖ్య దాదాపు 20 వరకు పెరిగి ప్రస్తుతానికి 53 మంది ఉన్నారు. సమస్య నా దృష్టికి వచ్చింది. తుర్కబావిగూడెం పాఠశాలలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉంది. అక్కడి నుంచి ఉపాధ్యాయురాలిని ఈ పాఠశాలకు డిప్యూటేషన్ చేస్తాం.

- కూకుట్ల నర్సింహ, ఎంఈవో, నార్కట్‌పల్లి

మూత్రశాలలకు తలుపుల్లేవు

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం సుమారు రూ.1.30 లక్ష ల అంచనాతో పనులు చేపటా రు. ఇందులో భాగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించారు. కానీ తలుపులు బిగించలే దు.నీటి కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు ఆరు బయటకు వెళ్లాల్సి వస్తుంది. నిర్మాణం చేసి న మొత్తానికి సంబంధించిన డబ్బులు రాకపోవడంతోనే పనులను అసంపూర్తిగా నిలిపివేసినట్లు తెలిసింది. నీటి ట్యాంకు కట్టాల్సి ఉండగా కట్టలేదు.



తలుపులు లేని మూత్రశాలలు

పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలి

మర్రిగూడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సత్వరమే పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తీగల సాగర్ అన్నారు. మండలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతా నికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కర్నాటి మల్లేశం, నాయకులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య, జెర్రిపోతుల ధనంజయ, మల్లేష్, లక్ష్మి, రామలింగచారి సలోజ్, యూవరాణి, శ్రీశైలం వెంకటేశం, రాములు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి లోపాలను సవరించాలి

కేతేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో లోపాలను సవరించి క్షేత్రస్థాయిలో రైతులందరికీ ప్రయోజనం కలిగేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6వేల సాయం మూడు విడతల్లో అందిస్తున్నా క్షేత్రస్థాయిలో రైతులందరికీ అందని పరిస్థితి నెలకొందన్నారు. కొత్త రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేయడానికి వీలులేకుండా పోయిందని తెలిపారు. కేంద్రం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ పథకాన్ని రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

గట్టుప్పల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో సందర్శించి మాట్లాడారు. ఐదేళ్ల క్రితం శంకుస్థాపన చేసి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని విమర్శించారు. వెంటనే పనులు పూర్తి చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు టేకుమట్ల కృష్ణ, ఉపాధ్యక్షుడు శివ, వ్యకాస మండల కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు

ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం : గోలి

నల్లగొండటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పాజీపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో చేపట్టిన పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న బియ్యం, గుడ్లు, నూనె ప్యాకెట్లు, ఇతర వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధానకార్యదర్శి పోతేపాక లింగస్వామి, నాయకులు బాకీ నరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యాదగిరి, గంగాధర్ పాల్గొన్నారు.

దేవాలయ భూమిని ఎవరికీ కేటాయించవద్దు

నార్కట్‌పల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేవాలయానికి చెందిన భూమిలో దేవాలయేతర కట్టడాలకు అనుమతి ఇవ్వవద్దని మండలంలోని అవురవాణి గ్రామస్థులు కోరారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ అవురవాణి గ్రామకంఠంలోని 33 గుంటల భూమిలో రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, గ్రామదేవత పెద్దమ్మ గుడి, నీటి ట్యాంకు నిర్మించినట్లు తెలిపారు. తాజాగా కొందరు గ్రామస్థులు ఆ స్థలంలో దేవాలయేతర నిర్మాణాలు చేపట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారని అనుమతి ఇవ్వవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఆర్.సత్యనారాయణ, ఒర్సు లక్ష్మయ్య, కల్లూరి కంఠ్ల మహేశ్వర్, మల్లేశ్, సుమన్, స్వామి, వెంకటేశ్, యాదయ్య, సైదులు, కృష్ణ, ఎల్లయ్య, బాలరాజు, నర్సయ్య, నర్సింహ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగించడం సరికాదు'

గట్టుప్పల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నిబంధనలు లేకున్నా మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడం సరికాదని మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా పనిచేస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో నాయకులు విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మండలకేంద్రంలో తమ ఫ్లెక్సీలను తొలగించిన మరుసటి రోజే కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలను పెట్టారని తెలిపారు. వాటిని అలాగే ఉంచినట్లు ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ చండూరు వైస్ ఎంపీపీ అవ్వారి శ్రీనివాస్, తే రట్‌పల్లి మాజీ ఎంపీటీసీ గొరిగె సత్తయ్య, బండారు చంద్రయ్య, చిలుకూరి అంజ య్య, పున్న కిశోర్, కర్నాటి వెంకటేశం, నేలంటి వెంకటేశం, జగన్, శ్రీనివాస్, అబ్బ య్య, చెరుపల్లి నగేష్, పున్న ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

కార్మికులకు ఉపాధి కల్పించాలి

నల్లగొండరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ముడి సరుకుల ధరలు తగ్గించి ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన తాపీ మేస్త్రీ, కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్పులు చేయడంతో నిర్మాణరంగంలో పెద్దపెద్ద మిషన్లతో నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. దీంతో కూలీలకు పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను మార్పు చేయడంపై ఆగస్టు 15వ తేదీన నల్లగొండ పట్టణంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని చేయాలని కోరారు. సదస్సులో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు అవుట రవీందర్, సైదచారి, నర్సింహ పాల్గొన్నారు.

చైతన్యయాత్రను జయప్రదం చేయాలి

నల్లగొండరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కోసం పోరాడి అమరులైన వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ నిర్వహించే అమరుల యాదిలో చైతన్యయాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నల్లగొండ వృత్తిదారుల సంఘం భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలని అన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అమరుల యాదిలో చైతన్యయాత్ర ఆగస్టు 2 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు చైగాని సీతారాములు, పాముపగుండ్ల అచ్చాలు, వెంకట్‌గౌడ్, పుల్లయ్య, గోపాల్, అంజయ్య, బుచ్చిరాములు, సైదులు, సత్తయ్య, యాదగిరి పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రణాళిక సిద్ధం

(5వ పేజీ తరువాయి)

యాంత్రీకరణ పథకం అమలుకు వ్యవసాయ అధికారులు కార్యాచరణను రూపొందిస్తున్నారు. కూలీల కొరత ఉన్న నేపథ్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడమే మంచిదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు కేంద్ర భాగస్వామ్యంతో సబ్సిడీపై రైతులకు పరికరాలు అందించేందుకు నిర్ణయించింది. మందుల పిచికారీకి డ్రోన్‌ల వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఆరేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అటకెక్కగా, తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు నచ్చిన కంపెనీకి చెందిన వ్యవసాయ పరికరాలనే అందించనున్నారు.

15 రకాల యాంత్రీకరణ పరికరాల గుర్తింపు..

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆరేళ్లుగా నిలిచింది. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశం లేకుండాపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కొనసాగగా, ఆ తర్వాత ఆరేళ్లపాటు నిలిచింది. ఈ పథకాన్ని అమలుచేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేసినా గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ ఊసు లేకుండాపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందజేయాలని నిర్ణయించింది. జిల్లాల వారీగా రైతుల నుం చి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, 15 రకాల యంత్ర పరికరాల జాబితాను రూపొందించారు. అందులో రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ఉన్నాయి.

సమాచారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

శాలిగౌరారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని చాడ రమేష్‌చందర్‌రెడ్డి ఆర్థికసహాయంతో మండలంలోని కేజీబీవీ, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చామల జైపాల్ రెడ్డి, కట్టంగూరి సురేందర్ రెడ్డి, బండపెల్లి కొమరయ్యగౌడ్, జమ్ము అశోక్, బొల్లికొండ గణేష్, గోపి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

మర్రిగూడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అక్రమాలపై విచారణ నిర్వహించి కఠినచర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్ శుక్రవారం విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం చేశారని, అక్రమాలు పాల్పడినట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంపై విచారణ చేపట్టి విద్యాశాఖ డైరెక్టర్‌కు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

చిట్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలోని రెండో వార్డుకు చెందిన కోనేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో సుమారు 50మంది శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఏర్పుల పరమేశం, మారగోని ఆంజనేయులు, ఇబ్రహీం, కుక్కల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

చిట్యాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి గడగోజు సతీష్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, జీవో నెంబర్ 25ను సవరించాలని కోరారు. అనంతరం 26డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కృష్ణనాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కోశాధికారి తోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న కార్మికుల ధర్నా 28న

మునుగోడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలను చెల్లించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఈ నెల 28న ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలె సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని నిర్ణయించారు. ధర్నా కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రేషన్‌కార్డులపై చర్చకు సిద్ధమా... : ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో 6.47 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చామని చెబుతున్న మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి నిరూపించేందుకు చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్ విసిరారు. అబద్ధాలు, అసత్యాలు చెప్పడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. నార్కట్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం 1835 మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి 6.47లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, మునుగోడు, హుజూరాబాద్ ఉపఎన్నికల్లో అది కూడా రేషన్‌కార్డులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ఇచ్చిన దరఖాస్తులన్నీ చెత్తబుట్టలపాలయ్యాయని విమర్శించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదేళ్ల పాలన అంతా అప్పులు... తప్పులేనని ఎద్దేవా చేశారు. అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారని ఒక్కో వ్యవస్థను నిలబెట్టేందుకు తమ ప్రజాప్రభుత్వం పనిచేస్తుంటే ప్రజల్లో ఉనికి కోల్పోతామనే అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు నిప్పులు గక్కుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు కలిసి చేసిన మొత్తం అప్పు లక్ష కోట్లు అయితే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8.50 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణను అప్పుల కుప్పగా మార్చాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, డీఎస్‌వో శ్రీధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మార్కెట్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు నర్రా వినోద, ఐతరాజు యాదయ్య, కాంగ్రెస్ నాయకులు దూదిమెట్ల సత్తయ్య, బండ సాగర్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, భరత్, యాదయ్య, తొడుసు వీరయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేష్, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.



రేషన్‌కార్డుల ప్రొసిడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం, జేసీ శ్రీనివాస్

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



నల్లగొండ పట్టణంలో నిర్వహించిన కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, చిట్యాల, చిట్యాల రూరల్, కనగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. నల్లగొండలోని షేర్‌బంగ్లా,సంతోష్ మాత ఆలయం, తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, వీటి కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని రామకోటి దేవాలయంలోని అమ్మవార్లను ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మహిళా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి సామూహికంగా కుంకుమార్చనలు చేశారు.

● చిట్యాల కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి అభిషేకాలు, వడిబియ్యం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మారగోని అంజనేయులు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● చిట్యాల మండలం నేరడలోని శాంభవీదేవీ ఆలయంలో అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు..

● కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ, అభిషేక పూజలు జరిపించి చీర సారె, ఒడి బియ్యం, బోనం. నైవేద్యాలను భక్తులు భక్తిశ్రద్ధలతో అందజేశారు.

యాజమాన్య పద్ధతులతోనే ఆయిల్‌పామ్ అధిక దిగుబడి

చిట్యాలరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతుల్లో సాగు చేస్తే ఆయిల్‌పామ్‌లో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన అధికారి శ్వేత, పతంజలి కంపెనీ మేనేజర్ నర్రా నరేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల శివారులో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటలో శుక్రవారం మొదటిదశ గెలల కోత, వాటి నాణ్యతా ప్రమాణాలపై పలువురు రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలలో వనమా వెంకటేశ్వర్లు, నేలపట్ల నరేందర్, కొంగర వినయ్‌కుమార్, బోయ వంశీ, మర్ల రవీందర్‌రెడ్డి, కుకునూరి శ్రీకాంత్, సాంబిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, అధికారులు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



కనగల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కనగల్, నార్కట్‌పల్లి, కేతేపల్లి, జూలై 25: (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల సాయన్న, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి కట్కోజు త్రివిక్రమ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కనగల్, నార్కట్‌పల్లి, కేతేపల్లి మండలాల్లో నిర్వహించిన బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీ అభ్యర్థులను గెలిపించి బీజేపీ సత్తా చాటాలని అన్నారు. యువత బీజేపీకి మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లి ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి, సీనియర్ నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం గ్రామాల్లో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు.

కనగల్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు పిండి పాపిరెడ్డి, తిరందాసు కనకయ్య, చెదురుపల్లి సైదులు గౌడ్, నకిరెకంటి శంకర్‌గౌడ్. మనిమద్దె వీరయ్య, భద్రమ్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, కొర్వి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌కుమార్, ఏర్పుల రవి, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేతేపల్లిలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు ఎ.అనితాగౌడ్, పద్మ, వి.నాగయ్య, ఎస్.విజయలక్ష్మి, ఎన్.సంధ్య, తొవిటి అఖిల్, సత్తిరెడ్డి, డి.సైదులు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలి

నల్లగొండటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ మమహాసభను విజయవంతం చేయాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో శుక్రవారం బీసీ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, నాయకులు వనం వెంకటేశ్వర్లు, విశ్వనాథుల శివకుమార్, జిల్లేపల్లి సాయి, చింతకాయల మురళి, వినయ్, చైతన్య, బి.రాజు, అనిల్ కుమార్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దీపేందర్

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	579 (280.1200)	1,20,635	6,598
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,653.23	456.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.558 (19.7310)	900	400

చికెన్ ధరలు: లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

మూసీ రెండు గేట్ల ఎత్తివేత



కేతేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు వరద రాక పెరిగింది. దీంతో శుక్రవారం ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం రాత్రి 643.50 అడుగులుగా ఉన్న మూసీకి ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు 3, 8 నెంబర్ క్రస్ట్ గేట్లను అడుగుమేర ఎత్తి 1,340క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 7

ముసురేసింది



నల్లగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ముసురు కురిసింది. పత్తి చేలకు ఈ వర్షం జీవం పోసినట్లయింది. జిల్లా కేంద్రం పానగల్‌లోని చందనపల్లి సమీపంలో ముసురులోనే బతుకమ్మ పాటలు పాడుతూ మహిళా కూలీలు వరి నాట్లు వేశారు. అత్యధికంగా యాదాద్రి జిల్లా రాజాపేట మండలం పాముకుంటలో 18.5మి.మీ, నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేటలో 15.8మి.మీ, సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 15.5మి.మీ వర్షపాతం నమోదైంది.

సాగర్‌కు నిలకడగా వరద



నాగార్జునసాగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటి రాక నిలకడగా సాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 579 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 579 అడుగులకు (280.1200 టీఎంసీలు) చేరింది. ఎగువనుంచి 1,20,635 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, సాగర్ నుంచి మొత్తం 6,598 క్యూసెక్కుల నీటినిదిగువకు విడుదల చేస్తున్నారు. 7

'సొసైటీ యూరియా పక్కదారి'పై

సమగ్ర విచారణ

» విషయం బయటికి ఎలా పొక్కిందనే అంశంపై ఆరా » 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నల్లగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సొసైటీ యూరియా పక్కదారిపై సమగ్ర విచారణకు జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 'సొసైటీ యూరియా పక్కదారి' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సొసైటీకి కేటాయించిన యూరియాను ఫర్టిలైజర్ దుకాణం లో విక్రయించడం చట్టవ్యతిరేకమని, కథనం లో ప్రస్తావించి న అక్రమ విక్రయాల వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని ఆయన తెలిపారు. ఈ ఘటనపై విచారణ నిర్వహించి పూర్తి నివేదిక ఇవ్వాలని నకిరేకల్ ఏడీఏ, ఇద్దరు ఏవోలను ఆదేశించినట్లు తెలిపారు. ఎరువుల విక్రయాలకు సంబంధించి సీజన్ ఆరంభం నుంచి పూర్తి వివరాలతో నివేదిక తెప్పిస్తామని, తదుపరి చర్యలకు సిఫారసు చేస్తామని ఆయన తెలిపారు. ఇన్‌వాయిస్‌ల మార్పిడిపై కూడా విచారణ నిర్వహిస్తామన్నారు. అయితే నకిరేకల్ సింగిల్‌విండో ఛైర్మన్ మాత్రం సదరు ఎరువులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, సొసైటీకి కేటాయించిన ఎరువులు పక్కదారి పట్టలేదని ఆయన వివరణ ఇచ్చారు. విచారణ కమిటీ సింగిల్‌విండో ఎరువుల రికార్డులను, అదేవిధంగా ఫర్టిలైజర్ దుకాణం రికార్డులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశించారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరా

సొసైటీ యూరియా పక్కదారి పట్టిన విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులతో పాటు ఎరువుల దుకాణాల నిర్వాహకులు, సింగిల్‌విండో సీఈవోలు ఆరా తీశారు. విషయం బయటికి ఎలా వెళ్లిందనే అంశంపై ఒకరినొకరు ఫోన్లు చేసుకొని తెలుసుకున్నారు. తీగలాగితే డొంక కదిలినట్లు ఈ వ్యవహారంతో జిల్లాలో యూరియా పక్కదారి పడుతున్న విషయం వెలుగులోకి వచ్చిందని, అధికార యంత్రాంగం, విజిలెన్స్ అధికారులు సైతం అప్రమత్తమై సింగిల్‌విండో కౌంటర్లు, ఎరువుల దుకాణాల వద్ద విక్రయాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవని, ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వ్యవసాయ యాంత్రీకరణకు

ప్రణాళిక సిద్ధం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో గతంలో ఉన్న మార్గదర్శకాలను తొలగించి నూతన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 234ను జారీ చేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- » నూతన మార్గదర్శకాలు విడుదలచేసిన ప్రభుత్వం
- » 2025-26 ఆర్థిక సంవత్సరానికి పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు
- » ఉమ్మడి జిల్లాకు రూ.6.18కోట్లు మంజూరు
- » వచ్చే నెల 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- » సెప్టెంబరు 7 నుంచి 17 వరకు పరికరాల పంపిణీ

గతంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్య వసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికీ ఈ పథకాన్ని కొనసాగిస్తూ నిర్ణయం తీసకుంది. ఈ పథకం అమలు కోసం రూ.6.18కోట్లను కేటాయించింది. అందులో నల్లగొండ జిల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.1.84కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24 కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను ఈ పథకానికి కేటాయిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తించనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పథ కం అమలు ఆలస్యం కావడంతో బడ్జెట్ కేటాయింపులు చేయలేకపోయారు. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని వానాకా లం నుంచి యాసంగి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు.

వచ్చే నెల 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ...

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసా య యాంత్రీకరణ పథకానికి సంబంధించి వచ్చే నెల 5 నుంచి 15వ తేదీ వరకు రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకుంటా రు. గతంలో దరఖాస్తు చేసిన రైతులను సైతం పరిగణనలోకి తీసుకుంటారు. వ్యవసాయాధికారులు అన్ని దరఖాస్తులను కలెక్టర్లకు నివేదిస్తారు. కలెక్టర్లు ఆగస్టు 16 నుంచి 20వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. ఒకవేళ దరఖాస్తు ను తిరస్కరిస్తే అందుకు సంబంధించిన కారణాన్ని రైతులకు తెలియజేస్తారు. ఆగస్టు 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన రైతుల నుంచి డీడీలు తీసుకుంటారు. 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు మంజూరు ఉత్తర్వులు ఇస్తారు. సెప్టెంబరు 7 నుంచి 17వ తేదీలోగా రైతులకు పరికరాలు పంపిణీ చేస్తారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ...

- మిగతా 8వ పేజీలో...

నూతన మార్గదర్శకాలతో పథకం అమలు



రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు వెల్లడించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలుచేస్తాం. ప్రభుత్వం విధివిధానాలను వెల్లడించింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగంకానుంది. ఆధునిక పరికరాలతో వ్యవసాయం చేయడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. ఆగస్టు 5వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకొని లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి సెప్టెంబరు 17లోగా యాంత్రీకరణ పరికరాలు అందజేస్తాం. అర్హులైన ప్రతీ రైతుకు ఈ పథకాన్ని వర్తింపజేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ రైతులకు 50శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీ అందజేస్తాం.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా?

కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులకు చోటు ఎలా కల్పిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. మండలానికి 458 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో 172 మంది అనర్హులకు జాబితాలో చోటు కల్పించారని మండిపడ్డారు. మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కొత్త జాబితా రూపొందించాలని, ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్‌కు ఆదేశించారు. ఇళ్లు మంజూరై నిర్మించుకోలేని వారికి మహిళా సంఘాల నుంచి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. ఇంటిని నిర్మించుకోవడం ఇష్టం లేని వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ని పరిశీలించి ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించేందుకు స్థలాన్ని సేకరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శత్రునాయక్, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న ఉన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

నల్లగొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో భావితరాల కోసం ప్రతీ చోట మొక్కలు నాటాలని, అంతేగాక క్రమం తప్పకుండా నీరుపోసి కాపాడాలన్నారు. మహిళలు బాగా చదువుకొని పరిస్థితులకు తగ్గట్టుగా స్పందించాలన్నారు. మహిళ దృఢంగా ఉంటే ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిష్కరించుకోవచ్చన్నారు. మహిళా డిగ్రీ కళాశాలను అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత మార్చిలో డిజిటల్ తరగతులు ప్రారంభించామని, బయోటెక్నాలజీ వంటి కొత్త కోర్సులు ప్రవేశపెడతామన్నారు. కనగల్, తిప్పర్తిలో జూనియర్ కళాశాలలు ప్రారంభిస్తామన్నారు. జూనియర్ కళాశాల స్థాయిలో మధ్యలో చదువు నిలిపివేసిన వారు, ఇతరులు నేరుగా రామగిరి డిగ్రీ కళాశాలలో చేరవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష రేపు

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): జిల్లాలో ఈనెల 27న నిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారుల పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9గంటల వరకే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని, 10గంటల తరువాత ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని, ఒకటి హాల్‌టికెట్‌పై అతికించాలని, మరొకటి నామినల్‌రోల్స్ కోసం అవసరం ఉంటుందన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఐడీ కార్డు తీసుకురావాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రం లోనికి అనుమతించేది లేదన్నారు.

నేరాల అదుపునకు దృష్టి సారించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావసరాలకు అనుగుణంగా పోలీసుశాఖ పారదర్శకంగా సేవలందిస్తూ మన్ననలు పొందాలన్నారు. పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. నేరం చేసేవారికి శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా సమర్థ సేవలు అందించాలన్నారు. పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు నివారణకు పెట్రోలింగ్ పెంచాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్‌ల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, డీసీఆర్బీ డీఎస్పీ రవి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నియంత్రణకు చర్యలు

జిల్లా టీబీ నివారణ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

నాగార్జునసాగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీబీ వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. శుక్రవారం సాగర్‌లో అర్బన్ ఫ్యామిలీవెల్ఫేర్ సెంటర్, బస్తీ దవాఖానాలను ఆయన తనికీచేశారు. బస్తీ దవాఖానాల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీబీ రోగులకు న్యూట్రీషన్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ ఒకరి నుంచి ఒకరికి సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 13 ఆర్‌బీఎస్‌కే వాహనాలను, మూడు 102 వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎన్జీవోల సహకారంతో పోషక విలువలున్న న్యూట్రీషన్ కిట్‌లను రోగులకు అందజేయడంతో పాటు నెలకు రూ.1,000 నగదును అందజేస్తున్నామన్నారు. ఆయన వెంట అర్బన్ సెంటర్ సిబ్బంది గంగాబాయి, లింగయ్య, తిరుమలాచారి, బాలరాజు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



కుక్కడం కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో బొల్లారం భిక్షపతి

డీఈవో భిక్షపతి

మాడ్గులపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని కుక్కడం గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో అందిస్తున్న ఆహారం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల బోధనాభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని, విద్యార్థులు చదువుతోపాటు సమాజిక అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌వో వసంత, సిబ్బంది సునీత ఉన్నారు.

ఉమ్మడి జిల్లా స్పెషలాఫీసర్‌గా అనితా రామచంద్రన్



నల్లగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి అనితా రామచంద్రన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనితా రామచంద్రన్ నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగనున్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆమె పర్యవేక్షిస్తారు. గతంలో ఆమె యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు.

మోదీ పాలనలో దేశం అగ్రగామి : బీజేపీ

మిర్యాలగూడ టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో దేశం అగ్రగామిగా ఎదుగుతోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బంటు గిరి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ విలేకరులతో మాట్లాడారు. సువిశాల భారత దేశానికి సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన రెండో వ్యక్తిగా చరిత్రలో నిలిచారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా, పరిపాలనను వృత్తిగా కాకుండా బాధ్యతగా నిర్వహిస్తూ దేశాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెడుతున్నారన్నారు.

చింతపల్లి మండలంలో 7.8 మిల్లీ మీటర్ల వాన

చింతపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలో 7.8 మి.మీ.ల వర్షం కురిసింది. విత్తనాలు వేసి నెల రోజులు కావొస్తున్నా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి వరుణుడు కరుణించి ఐదు రోజులుగా కురుస్తున్న వానలతో పత్తి రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉంటే గొడకొండ్లలో మురుగుకాల్వల నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వర్షంనీరు వ్యాపార సముదాయల్లోకి చేరి, వ్యాపారం దెబ్బతింటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



దేవరకొండలోని ప్రాంతీయ వైద్యశాల

దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి
సామర్థ్యం పెరిగేనా?

- 200 పడకలకు పెంచాలని విజ్ఞప్తి
- పడకలు సరిపడక అవస్థలుపడుతున్న రోగులు
- వర్షాలు కురుస్తుండడంతో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశామంటున్న వైద్యాధికారులు

దేవరకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి 100 పడకలు సరిపడక పోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. 200 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎమ్మెల్యే బాలునాయక్, కలెక్టర్ ఇలాత్రిపాఠి, డీసీహెచ్ డాక్టర్ మాతృనాయక్ స్థలాన్ని పరిశీలించారు. కానీ ఆస్పత్రి మంజూరు కాకపోవడంతో సరిపడా పడకలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతీరోజు 600 నుంచి 700 మంది రోగులు వస్తుంటారు. దేవరకొండ నియోజకవర్గంతోపాటు మర్రిగూడ, నాంపల్లి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గుర్రంపోడు ప్రాంతాలనుంచి రోగులు ఆసుపత్రికి వైద్యంకోసం వస్తుంటారు. ప్రస్తుతం వంద పడకలు ఉన్నప్పటికీ ప్రతిరోజు 120 నుంచి 130 మంది వరకు రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారు. వర్షాకాలం కావడంతో పిల్లలు, వృద్ధులు సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన పడుతూ అధికంగా వైద్యంకోసం ఆస్పత్రికి వస్తున్నారు. వైద్యులు 25 మంది అన్నిరకాల వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ పడకలు సరిపడా లేకపోవడం, చిన్నచిన్న రోగాలకు హైదరాబాద్, నల్లగొండ ఆస్పత్రులకు రెఫర్ చేస్తుండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో డెంటల్ డాక్టర్ ఉన్నా డెంటల్ చైర్ లేకపోవడంతో ఇటీవల కలెక్టర్ ఆస్పత్రికి తనిఖీకి వచ్చినప్పుడు డాక్టర్ దృష్టికి తెచ్చారు. దంత వైద్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో అందడంలేదని రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉదయం 9గంటలకే ఆసుపత్రిలో రోగులు బారులు తీరడం కనిపించింది. సూపరింటెండెంట్ లేకపోవడంతో ఇన్‌చార్జి సూపరింటెండ్ డాక్టర్ రవిప్రకాష్ విధులు నిర్వహిస్తున్నారు. వంద పడకల నుంచి 200 పడకల ఆస్పత్రికి ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి 100 పడకల నుంచి 200 పడకలుగా ఏర్పాటుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా వైద్యశాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం 100 పడకలు ఉన్నా సరిపోవడంలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

డాక్టర్ రవిప్రకాష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

మెరుగైన వైద్యం అందించాలి



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి. 200 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలి. రోగులకు సరిపడా పడకలు లేకపోవడంతో వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. జేబులు ఖాళీ చేసుకొని అప్పుల పాలవుతున్నారు. మందులు పంపిణీచేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తేనే వైద్యులకు గుర్తింపు.

దేప సుదర్శన్‌రెడ్డి, గొట్టిముక్కల

బీఆర్ఎస్ నేతను పరామర్శించిన భగత్


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, జూలై25(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీకి చెందిన బీఆర్ఎస్‌నేత పిల్లి వెంకట్ తండ్రి రాములు అనారోగ్య కారణంతో గురువారం మృతి చెందారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పిల్లి వెంకట్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పిల్లి రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయనవెంట పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ నల్లగొండ సుధాకర్, మాజీ మార్కెట్ డైరెక్టర్లు పొదిల శ్రీనివాస్, సురభి రాంబాబు, మాతంగి కాశయ్య, పంగ లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి

- ఆర్డీవో, ఎంపీడీవోకు వినతి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దేవరకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో డానియల్‌కు శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ డివిజన్‌లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తుండడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వరికుప్పల శ్రీను, ఆర్మి కూరెళ్ల కృష్ణమాచారి, గడ్డం భిక్షమయ్య, అప్పం వీరయ్య, పాత్లావత్ లక్ష్మణ్‌నాయక్, కానుగుల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రణాళిక సిద్ధం

(5వపేజీ తరువాయి)

యాంత్రీకరణ పథకం అమలుకు వ్యవసాయ అధికారులు కార్యాచరణను రూపొందిస్తున్నారు. కూలీల కొరత ఉన్న నేపథ్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడమే మంచిదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు కేంద్ర భాగస్వామ్యంతో సబ్సిడీపై రైతులకు పరికరాలు అందించేందుకు నిర్ణయించింది. మందుల పిచికారీకి డ్రోన్‌ల వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించనున్నారు. గత ఆరేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అటకెక్కగా, తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు నచ్చిన కంపెనీకి చెందిన వ్యవసాయ పరికరాలనే అందించనున్నారు.

15 రకాల యాంత్రీకరణ పరికరాల గుర్తింపు..

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం గత ఆరేళ్లుగా నిలిచింది. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశం లేకుండాపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కొనసాగగా, ఆ తరువాత ఆరేళ్లపాటు నిలిచింది. ఈ పథకాన్ని అమలు చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేసినా గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ ఊసు లేకుండాపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందజేయాలని నిర్ణయించింది. జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, 15 రకాల యంత్ర పరికరాల జాబితాను రూపొందించారు. అందులో రోటర్‌వేటర్‌లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ఉన్నాయి.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- విద్యుత్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలి
- ప్రత్యేక కోర్టు సీజీఎం రామాంజనాయక్


వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న రామాంజనాయక్

మిర్యాలగూడ అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులతోపాటు పలు సమస్యల పరిష్కారమే లక్ష్యమని ప్రత్యేక కోర్టు సీజీఎం రామాంజనాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలను ప్రత్యేక కోర్టు దృష్టికి తీసుకవచ్చారు. ప్రధానంగా విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, బిల్లుల్లో తేడా, కొత్త సర్వీసుల మంజూరులో జరుగుతున్న జాప్యం తదితర సమస్యలను ఫోరం దృష్టికి వినియోగదారులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. వినియోగదారులు తమ సమస్యలను ప్రత్యేక కోర్టు దృష్టి తెస్తే విచారించి న్యాయం చేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో తీవ్ర కాలయాపన జరుగుతుందన్న విషయాన్ని పలువురు రైతులు సీజీఎంకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారించి సకాలంలో కనెక్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులను స్వీకరించేందుకు కస్టమర్ సర్వీస్ పాయింట్లను ప్రతీ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసి విద్యుత్ శాఖ పనితీరులో పారదర్శకత ఉండేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ ఇండిపెండెంట్ మెంబర్ వెంకట్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈ శ్రీనివాసచారి, ఏడీఈలు తిరుపతయ్య, రవికుమార్, ఏవో శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి, ఏఈలు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, బాలు, అమర్‌సింగ్, శరత్ కుమార్, మహేష్, మణిదీప్, నాగరాజు, హబీబ్, వెంకటేశ్వర్లు, పాండురంగ, విజయ్‌కుమార్, ఉపేందర్, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ రాష్ట్రనేత కంకణాల వెంకట్‌రెడ్డి

చింతపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్రనేత కంకణాల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చింతపల్లి మండలం కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల అత్యధిక స్థానాలు గెలుపొందేలా కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రోగాల బారి నుంచి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వింజమూరి రవి, ఎల్లంకి అశోక్, వంద నపు ఆంజనేయులు, ఎండి.ఖాలేద్, బాదేపల్లి నిరంజన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్‌యాదవ్

కొండమల్లేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్‌యాదవ్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్‌కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు భూతరాజు భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జంగిటి మల్లేష్, నెల్లికంటి గోపి, సున్నం పద్మ, ఎర్ర వెంకటేశ్వర్లు, యాదయ్య, తరుణ్ పాల్గొన్నారు.

నందికొండలో ఫ్రైడే.. డ్రైడే

- సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

నాగార్జునసాగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నందికొండ(నాగార్జునసాగర్) మునిసిపాలిటీలో కాలనీలల్లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఫ్రైడే, డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, సిబ్బంది వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అంతేకాకుండా వార్డుల్లో ఉన్న మురుగు గుంతల్లో దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేశారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ గురులింగం, రమేష్, సంధ్య, కళ్యాణి, కీర్తిరెడ్డి, బాలాజీ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ టౌన్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ గుణవేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు.


సాగర్‌లో పాత టైర్లలో నీటిని తొలగిస్తున్న సిబ్బంది

శిథిలావస్థకు చేరిన పురాతన ఇళ్లలో నివసించ వద్దన్నారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాజా, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఇళ్లు, దుకాణాల నుంచి వెలువడే చెత్తను తడి, పొడిగా విభజించి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఆయనవెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, శ్వేత తదితరులున్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న అమీర్ అలీ, హెచ్‌ఎం వీరాసింగ్

హాలియా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి వీర జవాన్ ఈరేటి మహేష్ జ్ఞాపకార్థం నరేష్, మౌనిక దంపతుల సహకారంతో గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమీర్ అలీ ఫౌండేషన్ చైర్మన్ అమీర్‌అలీ, ప్రధానోపాధ్యాయుడు వీరాసింగ్, మజహర్ మొయినొద్దీన్, అన్వరొద్దీన్, ఉపాధ్యాయులు ఏడుకొండలు, రావులపాటి శ్రీను, గడ్డం రమణయ్య, కాకునూరి సైదులు, ఇబ్రహీం, యూసుఫ్, జాని, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి, జూలై25 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్ గ్రామ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో మిగిలిన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌లో (ఎంఎల్‌టీ)లో 10సీట్లకు, బైపీసీలో ఐదు సీట్లకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ కత్తుల సరళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఎస్‌బీఐ పాయింట్‌ను ప్రారంభిస్తున్న రమేష్

వేములపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారులకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన పేపాయింట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వేములపల్లి ఎస్‌బీఐ మేనేజర్ రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఎస్‌బీఐ సీఎస్‌పీ పాయింట్‌ను పేపాయింట్ జిల్లా మేనేజర్ తునుకు నరేష్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీ గోపి, నాయకులు మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, కట్టా మల్లేష్‌గౌడ్, గౌరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

- కవి, రచయిత కస్తూరి ప్రభాకర్


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కస్తూరి ప్రభాకర్

దామరచర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కవి, రచయిత కస్తూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన మండల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సీఈఆర్టీ ద్వారా అందిస్తున్న కథల పుస్తకాలు ఎంతో దోహదపడుతున్నాయని, ఈ పుస్తకాలను విద్యార్థులకు అందించి వారిలో పఠనాసక్తిని పెంచాన్నారు. వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో పని చేస్తే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బండ వెంకట్‌రెడ్డి, కేతావత్ సైదానాయక్, బాలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలేవీ..?



- మూలనపడిన ఫాగింగ్ యంత్రాలు
- గ్రామాల్లో పెరుగుతున్న దోమల వ్యాప్తి

అసలే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే. వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితులు మరింత దారుణంగా మారుతుంటాయి. ఎక్కడ పడితే అక్కడ వరద నీరు నిల్వ ఉండి మురుగు కాల్వలు అపరిశుభ్రంగా మారి అధ్వానంగా తయారవుతాయి. దోమలు, ఈగల వ్యాప్తి విపరీతంగా పెరిగి ప్రజలు మలేరియా, డెంగీ, డయేరియా, చికెన్‌గున్యావంటి రోగాల బారిన పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

గ్రామీణ ప్రజలను సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు వర్షాకాలంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. వానాకాలంలో ప్రత్యేకించి దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉండగా, వానకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు

వానాకాలంలో దోమల నివారణకు గతంలో పంచాయతీలు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశాయి. నిధులు తక్కువగా ఉండే జీపీలు.. పక్కన జీపీల నుంచి తీసుకుని వాడుకునేలా అధికారులు చర్యలు తీసుకునేవారు. గతేడాది వరకు అడపదడపా వాటి వినియోగం కనిపించినా ఈ ఏడాది మాత్రం నామమాత్రంగా కూడా కన్పించడం లేదు. పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో ఏ ఒక్క జీపీలో కూడా వీటిని వినియోగించడంలేదు. ఒక్కో పొగ యంత్రానికి రూ.40వేల నుంచి రూ.60 వేల వరకు జీపీ నిధులు వెచ్చించి కొనుగోలు చేశారు. వాటి వినియెగంపై అవగాహన లేక డీజిల్, లిక్విడ్ సమపాళ్లలో కలపకపోవడంతో తరుచూ రిపేర్‌కు వస్తున్నాయి. మళ్లీ మరమ్మతులు చేయించాలంటే ఖర్చు భారీగా అవుతున్నట్లు సమాచారం. దీంతో గతేడాది పాడైపోయిన యంత్రాలు ఇప్పటివరకు మరమ్మతులకు నోచలేదు. నిధుల లేమితో యంత్రాలు గ్రామపంచాయతీ కేంద్రాల్లో మూలకుపడ్డాయి.

వేధిస్తోన్న నిధుల లేమి

గత ప్రభుత్వం దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రతీ గ్రామపంచాయతీలో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసుకునేలా నిధులు కేటాయించింది. గతేడాది ప్రస్తుత ప్రభుత్వం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని చేపట్టగా ఈ ఏడాది కార్యక్రమ ప్రభావం కానరావడంలేదు. పారిశుధ్య పనులపై గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తుండగా, నిర్వహణకు నిధులు లేవని వారు చేతులెత్తేస్తున్నారు. అనేక గ్రామ పంచాయతీల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు,నిండుగా మురుగు కాల్వలు, అంతర్గత రహదారులపై మురుగు నీరు పారుతుండటం వంటివి దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిల్వ నీటి మడుగుల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు కూడా తీసుకోవడంలేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ప్రతీ బుధవారం ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. డ్రైడే నిర్వహణ, నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. ఫాగింగ్ యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. పాడైన ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

ఎంపీడీవో చంద్రమౌళి, పీఏపల్లి.